క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీనృసింహుడి పల్లకీ ఉత్సవం



పెన్నహోబిలంలో లక్ష్మీసింహుడి పల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధి చెందిన పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శ్రీవారి పల్లకీ ఉత్సవం శనివారం నేత్రపర్వంగా సాగింది. ఉదయం స్వామికి అభిషేకం, మహా మంగళహారతి, దీక్షాహోమం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విశేష పుష్పాలతో అలంకరించిన పల్లకీలో భూదేవి, శ్రీదేవి సమేత లక్ష్మీనృసింహుడిని కొలువుదీర్చి ఆలయ వీధుల్లో ఊరేగించారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

బొమ్మనహాళ్: శింగానహళ్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత పూల హనుమంతరెడ్డి (67) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన .. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సర్పంచ్ కృష్ణ, నాయకులు ఆంజనేయులు, తిప్పేస్వామి, దేవన్న తదితరులు హనుమంతరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

రాయదుర్గంటౌన్: శ్రీకాకుళంలో ఫిబ్రవరి 6 నుంచి 9 వరకు జరగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని అనంతపురం జిల్లా అధ్యక్షుడు కొట్రేష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అతిథి గృహంలో రాష్ట్ర మహాసభ పోస్టర్లను విడుదల చేశారు. కొట్రేష్ మాట్లాడుతూ శ్రీకాకుళంలో నాలుగు రోజుల పాటు జరగనున్న 22వ రాష్ట్ర మహాసభలు భావి యువజన ఉద్యమాలకు నాందీ పలుకుతాయన్నారు. ఏఐవైఎఫ్ రాయదుర్గం అధ్యక్షుడు కుమార్, సహాయ కార్యదర్శులు నవీన్, నాగయ్య, శంకర్, మారేష్, జునైద్, అమన్, సోహెల్ పాల్గొన్నారు.

వయసుకు తగిన బరువుండాలి

కూడేరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు వారి వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉండేలా చర్యలు చేపట్టాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ శ్రీదేవి సూచించారు. శనివారం సీడీపీఓ శ్రీదేవి మండలంలోని కమ్మూరులోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదులు, కేంద్రాల పరిసరాలను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహార నాణ్యతను పరిశీలించారు. సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు లీలావతి, చంద్రకళ పాల్గొన్నారు.

జంబుగుంపలలో క్రికెట్ టోర్నీ

కుందుర్పి: జంబుగుంపలలో సంక్రాంతి పండుగ సందర్భంగా గ్రామీణ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 నుంచి టోర్నీ ప్రారంభమవుతుందని, ఆసక్తి ఉన్న జట్లు 13లోపు ఎంట్రీ ఫీజు రూ.1,016 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విన్నర్ ప్రైజ్ రూ.15వేలు, రన్నర్ ప్రైజ్ రూ. 8 వేలు నగదు బహుమతి ఉంటుందన్నారు. వివరాలకు సెల్: 8886754454, 8688635042లో సంప్రదించాలన్నారు.

జీవనశైలిలో మార్పుతోనే కేన్సర్ దూరం

రాయదుర్గంటౌన్: జీవనశైలిలో మార్పుతో చాలా వరకూ కేన్సర్‌ను అధిగమించొచ్చని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యుడు యశ్వంత్ సూచించారు. శనివారం స్థానిక 14వ వార్డు జేఆర్ఎస్ కాలనీలోని డీపీఈపీ స్కూల్‌లో కాలనీవాసులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యుడితో పాటు హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మీనారాయణ, సచివాలయ హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. కేన్సర్ పరిశోధన, చికిత్సలో ఆధునిక పురోగతిపై మహిళలకు అవగాహన కల్పించారు. ఎలాంటి కేన్సర్ లక్షణాలు ఉన్నా వెంటనే సమీప ఆస్పత్రిలోవైద్యులను సంప్రదించి నివారించుకోవాలన్నారు.

వేంకటరమణుడికి తిరుప్పావై సేవ



ప్రసన్న వేంకటరమణ స్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసిద్ధిగాంచిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలు జరుగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ధనుర్మాస పూజల సందర్భంగా స్వామికి తిరుప్పావై సేవ నిర్వహించారు. ఈనెల 13న గోదాదేవి కల్యాణోత్సవం జరుగుతుందని దేవదాయశాఖ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో ఉత్సవాన్ని నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి మరుసటి రోజు జరిగే ఉత్సవానికి మహిళలు, బాలికలు హాజరై పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు పూజలు చేశారు.



రాళ్లపల్లి వంకలో ఇసుకను తవ్వుతున్న జేసీబీ

ఇసుక తరలించేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

అధికారమే అండ.. అడ్డగోలు దందా

- కంబదూరు మండలంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా
- నదులు, వంకలు, వాగులనూ వదలని తమ్ముళ్లు
- పోలీసు స్టేషన్‌కు చేరిన ఇసుక పంచాయతీ
- మూకుమ్మడిగా అడ్డుకున్న రాళ్లపల్లి గ్రామస్తులు
- బెదిరింపులకు దిగిన టీడీపీ నాయకులు

కంబదూరు: మండలంలో టీడీపీ నాయకులు అధికారమే అండగా అడ్డగోలు దందా చేస్తున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఉచితం పేరిట ఇసుకను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. నదులు, వంకలు, వాగులను విచ్చలవిడిగా తవ్వేస్తూ ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత మండలంలోని టీడీపీ చోటామోటా నాయకులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తుండగా రాళ్లపల్లి గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో వారిపై టీడీపీ నాయకులు బెదిరింపులకు దిగారు. ఇసుక పంచాయితీ కాస్త పోలీస్ స్టేషన్‌కు చేరింది.

మండలంలోని నూతిమడుగు, చెన్నంపల్లి, గూళ్యం, రాంపురం, రాళ్లపల్లి, రాళ్లఅనంతపురం, తిమ్మాపురం గ్రామాల్లోని పెన్న నదుదులు, వాగులు, వంకల్లోని ఇసుకను తెలుగు తమ్ముళ్లు తోడేస్తూ.. జేసీబీల సాయంతో సమీపంలో ఇసుకను డంప్ చేసి రాత్రింబవళ్లు టిప్పర్, ట్రాక్టర్లల్లో ద్వారా ఇసుకను కర్ణాటక, అనంతపురం, కళ్యాణదుర్గం, కంబదూరు తదితర ప్రాంతాలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

> **చోద్యం చూస్తున్న అధికారులు..**
>
> కంబదూరు మండలంలో ఇసుక దందా జోరుగా జరుగుతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. పోలీసు,రెవెన్యూ అధికారులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు అంటున్నారు. పోలీసులు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని డబ్బులు ఇచ్చిన వెంటనే వదిలేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక రవాణాలో కొందరు అధికారులకు మామూళ్లు అందుతుండడంతో ఇసుక అక్రమ రవాణాను చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.

పోలీసు స్టేషన్‌కు చేరిన ఇసుక పంచాయితీ

ఇటీవల రాళ్లపల్లిలో వంక నుంచి ఇసుకను తరలించడానికి వెళ్లిన మేళ్లకుంటకు చెందిన టీడీపీ నాయకులను గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఈ సమస్య కాస్త పోలీస్ స్టేషన్ దాకా చేరింది. సమస్య పెద్దది కాకుండా సీఐ నీలకంఠేశ్వర ఆధ్వర్యంలో నలుగురు ఎస్ఐలు సిబ్బంది రంగంలోకి దిగారు. రాళ్లపల్లి కి చెందిన ప్రజలు పోలీస్ స్టేషన్ వద్దకు చేరి, ఎట్టి పరిస్థితుల్లోనూ వంకలోని ఇసుక తరలించకూడదని పోలీసులకు తెగేసి చెప్పడంతో సీఐ నీలకంఠశ్వర, తహసీల్దార్ బాలకిషన్ గ్రామస్తులు, పెద్ద మనుషులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు 5 ట్రాక్టర్ల ఇసుకను తోలుకోవడానికి వీలుగా తీర్మానం చేశారు. ఇసుక రవాణాను అడ్డుకోవడంతో రాళ్లపల్లి గ్రామానికి శ్రీరామరెడ్డి తాగునీరు సరఫరా కాకుండా టీడీపీ నాయకులు పైపులైన్‌ను ధ్వంసం చేశారు. పైపులైన్ మరమ్మతు చేస్తే 5 ట్రాక్టర్ల ఇసుకను తవ్వుకోవడానికి అనుమతి ఇస్తామని రాళ్లపల్లి గ్రామస్తులు చెప్పడంతో అందుకు టీడీపీ నాయకులు ఒప్పుకున్నారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

ఇసుక రవాణా అడ్డుకున్న రాళ్లపల్లి గ్రామస్తులు



అక్రమ ఇసుక రవాణాను అడ్డుకుంటున్న రాళ్లపల్లి గ్రామస్తులు

కంబదూరు మండలంలో టీడీపీ నాయకులు నదుగు, వాగులు, వంకలలోని ఇసుకను విచ్చలవిడిగా తవ్వేస్తుండడంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఫలితంగా సమీపంలోని వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయి. ఈక్రమంలో రాళ్లపల్లి గ్రామస్తులు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సంబంధిత అధికారులకు పదే పదే ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడంలేదు. దీంతో గ్రామస్తులు, రైతులు ఇసుక రవాణాను అడ్డుకున్నారు. ఇటీవల రాళ్లపల్లి వంక నుంచి పెద్ద ఎత్తున ఇసుక రవాణాను చేయడానికి కొందరు టీడీపీ నాయకులు జేసీబీ, ట్రాక్టర్లతో ప్రయత్నిస్తుండగా గ్రామస్తులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. గ్రామస్తులపైనే టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. 'మా ప్రభుత్వంలో..మేము ఇసుక తోలుకోకూడదా? మా ఎమ్మెల్యే ఉన్నాడు.. మేమే ఇసుక తోలుకుంటాం.. అడ్డొస్తే అంతు చూస్తాం' అంటూ బెదిరింపులకు దిగారు. పోలీసులు కూడా బెదిరించేలా ఒత్తిళ్లు చేయించారు. అయినా గ్రామస్తులు బెదరకుండా టీడీపీ నాయకులను వెనక్కి పంపించేశారు.

సరిహద్దు దాటుతున్న ఇసుక



గుమ్మఘట్ట: గుమ్మగట్ట మండలంలోని తాళ్లకెర, బీటీపీ, కేపీ కుంట గ్రామాల సమీపంలోని వేదావతి హగరి నుంచి ఇసుకను రాత్రివేళల్లో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా కర్ణాటకకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. టీడీపీ నాయకులు ఇటీవల తాళ్లకెర నుంచి రాత్రివేళల్లో ఇసుక తరలిస్తుండగా రెవెన్యూ సిబ్బంది కేసు నమోదు చేశారు. ఈ విషయంపై ఆర్డీఓ వసంతబాబును అడగ్గా ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్ణాటకకు ఇసుక తరలిపోకుండా నిఘాను మరింత పటిష్టం చేస్తామన్నారు. ఇసుకను తరలిస్తే వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేస్తామన్నారు.

ఎలా బతకాలి?



మా గ్రామంలో చిన్న వాగు ఉంది. ఆ వాగులో ఇసుకను తోలుకోవాలని టీడీపీ నాయకులు దౌర్జన్యంగా జేసీబీలు, ట్రాక్టర్లతో వచ్చారు. అసలు ఆ ఇసుకను తోడితే తాగేందుకు కూడా నీళ్లు ఉండవు. అందుకే మూకుమ్మడిగా ఇసుక రవాణాను అడ్డుకున్నాం.టీడీపీ నాయకులు దౌర్జన్యంగా ట్రాక్టర్లతో ఇసుక తోలుతామని పోలీసులను వెంట బెట్టుకొని వచ్చారు. ఇసుక తోలితే బోర్లు ఎండిపోయి పంటలన్నీ నష్టపోవడంతో పాటు తాగేందుకు నీళ్లుకూడా ఉండవు. మా ఎమ్మెల్యేతో సహా వస్తాం.. మీ కథ చూస్తామని టీడీపీ నాయకులు బెదిరిస్తున్నారు..ఇలా అయితే మేము గ్రామంలో ఎలా బతకాలి..?

– రాళ్లపల్లి గ్రామ మహిళలు

ప్రజలు చైతన్యం కావాలి



విచ్చల విడిగా ఇసుకను అక్రమంగా తరలించడం ద్వారా వంకలు, వాగులు ఉన్న సమీప గ్రామాల్లో భూగజర్భ జలాలు అడుగంటిపోతాయి. వ్యవసాయ బోర్లలో నీళ్లు రాక వ్యవసాయాన్ని వదిలేసి రైతులు వలస వెళ్లాల్సి వస్తోంది. ఇలాంటి తరుణంలో ప్రజలు చైతన్య వంతులు కావాలి, ఇసుకను ఇంటి నిర్మాణాలకు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు ఉపయోగించుకోవాలే కానీ అమ్ముకోవడం సరైంది కాదు. అమ్ముకోవడానికి ఇసుకను తరలిస్తుంటే ప్రజలే ధైర్యంగా అడ్డుకోవాలి. వారికి వైఎస్సార్‌సీపీ, నేను అండగా ఉంటాం.

– తలారి రంగయ్య, మాజీ ఎంపీ, నియోజకవర్గ సమన్వయకర్త, కళ్యాణదుర్గం

అధినేత జగన్‌ను కలిసిన విద్యార్థి విభాగం నాయకుడు



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన నవీన్‌కుమార్

వజ్రకరూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తట్రకల్లుకు చెందిన విద్యార్థి విభాగం నాయకుడు నవీన్‌కుమార్ కలిశారు. ఇటీవల విజయవాడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్ జగన్ సూచించినట్లు నవీన్ కుమార్ తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి



రాయదుర్గంలో వడ్డే ఓబన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వడ్డెర్లు

రాయదుర్గంటౌన్: రాయదుర్గం వడ్డెర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. పట్టణంలోని వడ్డే కాలనీలోని ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం పట్టణంలోని వినాయక సర్కిల్‌లో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలు వేసి, నివాళులర్పించారు. నాయకులు శ్రీనివాసులు, గోవిందు పాల్గొన్నారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి



వడ్డే ఓబన్న చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కణేకల్లు: మండలంలోని యర్రగుంటలో స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఓబన్న చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఉంచి గ్రామ వీధుల్లో ఊరేగించారు.

బ్రహ్మసముద్రం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. ఎంపీడీఓ నందకిశోర్ వడ్డే ఓబన్న చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, జూనియర్ అసిస్టెంట్ సురేష్, టైపిస్టు సుధాకర్, కార్యాలయ సిబ్బంది హేమంత్ , శివ, ప్రసాద్ పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి



సునీతబాయి

విడపనకల్లు: తహసీల్దార్ ఆర్‌వీ సునీతబాయి డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. గతేడాది ఆగస్టు 5న విడపనకల్లు తహసీల్దార్‌గా ఆమె బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా కర్నూలు నేషనల్ హైవేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించినట్లు శనివారం ఆమె తెలిపారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల విడుదల చేసిన జిల్లా కమిటీలో కళ్యాణదుర్గం నేతలకు సముచిత స్థానం లభించింది. అధికార ప్రతినిధిగా ముదిగల్లుకు చెందిన గోపారం శ్రీనివాసులు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడిగా కోనాపురం గంగాధర, జనరల్ సెక్రటరీగా ములకలనూరు బోయ తిమ్మరాయుడు, ఆర్గనైజేషనల్ సెక్రటరీలుగా కరణం రాహుల్, తలారి సత్యప్ప, యాక్టివిటీ సెక్రటరీలుగా యర్రంపల్లి కృష్ణమూర్తి, పి.ఆనంద్ చౌదరికి స్థానం లభించింది. వారు జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, సీనియర్ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



కరణం రాహుల్, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి



కోనాపురం గంగాధర, జిల్లా ఉపాధ్యక్షుడు

బ్రహ్మసముద్రం : వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీలో పలువురు మండల నాయకులకు చోటు దక్కింది. జిల్లా ఉపాధ్యక్షుడిగా కోనాపురం గంగాధర, జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శిగా వెస్ట్ కోడిపల్లికి చెందిన కరణం రాహుల్‌కు అవకాశం కల్పించారు. వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి కమిటీలో చోటు కల్పించిన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త తలారి రంగయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కార్యాచరణ కార్యదర్శిగా మల్లెల జగదీష్



జగదీష్ , జిల్లా కార్యనిర్వహణ కార్యదర్శి

వజ్రకరూరు: వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాచరణ కార్యదర్శిగా చాబాల గ్రామసర్పంచు మల్లెల జగదీష్‌ను నియమించారు. మల్లెల జగదీష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

జిల్లా కమిటీలో బెళుగుప్ప నాయకులకు చోటు



బెళగల్లు శివలింగప్ప, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు



జెక్కన్నగారి భాస్కర్‌రెడ్డి, పార్టీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు

బెళుగుప్ప: బెళుగుప్పకు చెందిన బెళగల్లు శివలింగప్పను పార్టీ అధిష్టానం జిల్లా ఉపాధ్యక్షుడిగా, జెక్కన్నగారి భాస్కర్‌రెడ్డిని పార్టీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ అధిష్టానం నియమించింది. తమకు పార్టీలో సముచిత స్థానం కల్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కమిటీలో చోటు దక్కించుకున్న ఉరవకొండ నాయకులు









ఉరవకొండ: పార్టీ జిల్లా కమిటీలో నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులకు కీలక పదవులు దక్కాయి. ఇందులో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉరవకొండ మండలం రాకెట్లకు చెందిన సీనియర్ నాయకుడు పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ ముత్తలూరు అశోక్‌కుమార్‌కు చోటు దక్కింది. అధికార ప్రతినిధిగా సీపీ వీరన్న, జిల్లా కార్యదర్శిగా హవళిగికి చెందిన భరత్‌రెడ్డి నియమితులయ్యారు. పార్టీ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఉరవకొండకు చెందిన సుద్దాల వెంకటేషలు నియమితులయ్యారు. వీరు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పార్టీ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా



ఎం.నారాయణ రెడ్డి , జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి

కూడేరు: వైఎస్సార్ సీపీని అభివృద్ధి పరచడమే లక్ష్యంగా పని చేస్తానని ఆ పార్టీ జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి, ఎంపీపీ నారాయణ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. తనకు అవకాశమిచ్చిన పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, సమన్వయకర్త, వై.విశ్వేశ్వర రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శికి సన్మానం

కంబదూరు: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ములకనూరు తిమ్మరాయుడును వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శనివారం సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంటరామిరెడ్డి, మాజీ ఎంపీ, నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య, రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



తిమ్మరాయుడును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సంక్షిప్త సమాచారం

ఉచితంగా పాడి పశువుల పంపిణీ

కుందుర్పి: మండలంలో సుస్థిర వ్యవసాయం ప్రోత్సహించేందుకు కుసుమగిరి రైతు ఉత్పత్తి దారుల కంపెనీ ఆధ్వర్యంలో 30 పాడి ఆవులను పంపిణీ చేసినట్లు సీఈఓ నరసింహమూర్తి శనివారం తెలిపారు. సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దశల వారీగా ఇప్పటికే 120 పశువులను అందించామన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

గుమ్మఘట్ట: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని గలగల పైదొడ్డి గ్రామంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.34.75లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీసీ రోడ్లను నిర్మించి గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఎంపీడీఓ రామకృష్ణ, పీఆర్ డీఈఈ సుధాకర్ నాయక్, డ్వామా ఏపీడీ ఆయేషా, పీఆర్ ఏఈ రాంశేఖర్, ఏపీఓ సురేశ్ పాల్గొన్నారు.


వరుస చోరీలతో జనం బెంబేలు

కళ్యాణదుర్గం: మండలంలో వరుస చోరీలతో జనం బెంబేలెత్తుతున్నారు. రెండు నెలల వ్యధిలోనే నాలుగైదు చోట్ల చోరీలు జరిగాయి. శుక్రవారం అర్ధరాత్రి బోరంపల్లిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఉన్న చిన్న హోటల్ కిటికీ ద్వారం వద్ద రేకులను కత్తిరించి దుండగులు లోపలికి చొరబడ్డారు. దుకాణంలోని తినుబండారాలు, కొంత నగదు కలిపి రూ.30 వేలు మేర ఎత్తుకెళ్లారు. దొంగతనాన్ని హోటల్ నిర్వాహకుడు శనివారం ఉదయం గమనించాడు.

ఉద్యోగుల వేళలకు బస్సులు నడపాలి

ఉరవకొండ: ఉద్యోగుల వేళలకు బస్సు సర్వీసులు నడపాలని ఏపీ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కోదండరామిరెడ్డి ఆర్టీసీ డీఎం బాలాజీ దయాళ్, జోనల్ చైర్మన్ పూల నాగరాజును వేర్వేరుగా కలిసి శనివారం విన్నవించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ రోజూ ఉరవకొండ డిపో నుంచి అనంతపురానికి వందలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు విధులు ముగించుకొని అనంతపురానికి వెళ్తుంటారన్నారు. వీరికి సాయంత్రం 5:30 గంటల తర్వాత సర్వీసులు అందుబాటులో ఉండడంలేదన్నారు. దీంతో పాటు ఉద్యోగులు బస్సులు లేక ప్రైవేట్ వాహనాలు, ఆటోల్లో వెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారులు సాయంత్రం 6 గంటల నుంచి అనంతపురానికి బస్సు సర్వీసులు నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్మికుల సేవలు అమూల్యమైనవి



సంక్రాంతి పండుగ సరుకులు పంపిణీ చేస్తున్న ఎస్ఐ నాగస్వామి

వజ్రకరూరు: పంచాయతీ కార్మికుల సేవలు అమూల్యమైనవని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలకబాల రామాంజనేయులు అన్నారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయ ఆవరణలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొలకబాల రామాంజనేయులు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు పండుగ సరుకులు అందించారు. ఎస్ఐ నాగస్వామి, సర్పంచు మోనాలిసా తదితరులు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నల్ల బోతులరాజు, సూపర్‌వైజర్ నాగశంకర్, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సింగానహళ్లిలో నాకాబందీ

బొమ్మనహాళ్: మండలంలోని సింగానహళ్లిలో ఎస్ఐ నబీర సూల్ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారు జామున నాకాబందీ నిర్వహించారు. గ్రామంలోని రౌడీషీటర్ల ఇళ్లు, కళ్లదొడ్లను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ హనుమంతరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.